
# సెక్స్ ఎడ్యుకేషన్



పిల్లలకు సెక్స్ ఎడ్యుకేషన్ ఉండాలని కొందరూ, ఉండకూడదని మరికొందరూ గొడవ పడటం మాకాలనీ వాళ్ళందరం న్యూస్ పేపర్స్‌లో చూస్తేనే ఉన్నాం. కానీ ఎవ్వరం దానిని గురించి పట్టించుకోలేదు. ఆ టాపిక్ కంటే పిల్లలకు సరయిన తిండీ బట్టా, విద్యా ఉండాలా అక్కర్లేదా అనే టాపిక్ గురంచి గొడవ చేస్తే సమంజసంగా ఉంటుందని మా అభిప్రాయం. అయితే అనవసరమయిన టాపిక్ గురించి గొడవ పడటం మనదేశం ప్రత్యేకత కాబట్టి మాకిష్టం లేకపోయినా ఆ టాపిక్ మా నెత్తిమీద కొచ్చి పడింది.

సెక్స్ ఎడ్యుకేషన్ పిల్లల పాఠ్యాంశాలలో చేర్చాలా వద్దా అనే విషయం స్టడీ చేయటానికి ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. మామూలుగా ఏ కమిటీ అయినా ముందు విదేశాలకెళ్ళి పోతుంది. గనుక ఆ కమిటీ కూడా అమెరికా, డెన్మార్క్ దేశాలు పర్యటించి ఆ తర్వాత హైద్రాబాద్ చేరుకుంది. హైద్రాబాద్‌లో స్టడీ చేయటం కోసం వాళ్ళు మా కాలనీని కూడా ఎన్నుకున్నారు.

ఆదివారం నాడు ఆ కమిటీ నాళ్ళు మా కాలనీ కొస్తారు కాబట్టి– మేమంతా ఎక్కడికీ వెళ్ళకుండా పిల్లలందరితోనూ సిద్ధంగా ఉండాలని మా కాలనీ సెక్రటరీ రంగారెడ్డి నోటీస్ పంపించాడు.

దొరికిన అవకాశాన్ని ఏమాత్రం వదలని ఆర్గనైజింగ్ సెక్రటరీ శాయిరామ్– మామూలుగానే– తెల్లారకుండానే వచ్చి మమ్మల్నందరినీ నిద్ర లేపేశాడు. ఇంక చేసేదిలేక అందరం ఎనిమిది గంటలకల్లా రడీ అయి పిల్లలందరినీ తీసుకుని కాలనీ మధ్య షామియానాలోకి చేరుకున్నాము.

మరికాసేపట్లో కమిటీ వాళ్ళ వచ్చేశారు కార్లో.

ఆ కమిటీ అధ్యక్షుడు లేచి మైక్‌లో మాట్లాడాడు.

"లేడీస్ అండ్ జెంటిల్మన్! మేము ఇక్కడికెందుకొచ్చామో మీ అందరికీ తెలుసు! మానవుని జీవితంలో ఆహారం తర్వాత ముఖ్యమయిన విషయం సెక్స్! అంత ప్రాముఖ్యత ఉన్న సెక్స్‌ని మనందరం నిర్లక్ష్యం చేస్తున్నాం. దాన్ని గురించి బేసిక్‌గా ఏమీ తెలీని పరిస్థితిలో మనమున్నాం! ఇందువల్ల నష్టం ఎవరికి? మనకీ, మన దేశానికీ! మనకీ, మన దేశానికి! కనీస సెక్స్ విద్య లేకపోవటం మూలాన ఎంతోమంది పిల్లలు పెరిగి పెద్దవారయి ఆరోగ్యానికి హాని తెచ్చుకుంటున్నారు. మేము అమెరికాలోనూ, డెన్మార్క్‌లోనూ చేసిన స్టడీ ప్రకారం అక్కడ పెద్ద క్లాసులో ఉన్న పిల్లలందరూ సెక్స్ ఎడ్యుకేషన్ నేర్చుకుంటున్నారు. దానివల్ల వారు డాక్టర్లను సంప్రదించే అవసరం లేకుండానే ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నారు. అదొక గొప్ప రివల్యూషన్. కనుక మనదేశంలో కూడా సెక్స్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టాలనే అభిప్రాయానికి మేము వచ్చాం. అయితే అసలు ముందు మన తెలుగు బాలబాలికలకు– ఆ విజ్ఞానం ఎంతవరకుందో– ఏ క్లాస్ నుంచీ వారికా పాఠాలు ప్రవేశపెట్టాలో నిర్ణయించడం కోసం స్టడీ చేయడానికి మీ కాలనీ కొచ్చాం."

అందరం తప్పట్లు కొట్టాము.

ఆ తరువాత శాయిరామ్ మాట్లాడాడు.

"సోదర సోదరీమణులారా! ఇది నిజంగా ఒక అపూర్వ అవకాశం! కమిటీ అధ్యక్షులవారు చెప్పినట్లు మన బాలబాలికలందరికీ సెక్స్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరమని నా అభిప్రాయం. మన బాలబాలికలు కూడా అమెరికాలోని బాలబాలికల స్థాయి కెదగాలని నా కోరిక–"

మళ్ళీ తప్పట్లు కొట్టామందరం.

ఆ తరువాత గోపాల్రావ్, జనార్ధన్ కూడా మాట్లాడుతామన్నారు గానీ బలవంతం చేసి ఆపేశాము. వమిటీ వాళ్ళ స్టడీ మొదలయిపోయింది.

మా కాలనీ పిల్లలు కొంతమందిని స్టేజి మీదకు పిలిచారు వాళ్ళు. పిల్లలంతా హుషారుగా స్టేజ్ ఎక్కి నిలబడ్డారు.

కమిటీ అధ్యక్షుడు మమ్మల్ని ఉద్దేశించి మాట్లాడాడు మళ్ళీ.

"లేడీస్ అండ్ జెంటిల్మెన్! ఈ పిల్లల్లో అయిదేళ్ళ వయసుగల వాళ్ళ నుంచీ పదిహేనేళ్ళ వయసున్న వాళ్ళ వరకూ ఉన్నారు. వీరందరికీ పాఠ్య పుస్తకాల్లో హిస్టరీ, సైన్స్ లెఖ్ఖలు లాంటి సబ్జెక్ట్స్ ఉన్నాయి కాబట్టి వాటిల్లో ఏ ప్రశ్నలడిగినా వీళ్లు సమాధానాలు చెప్పగలగుతారు. అదే సెక్స్ విజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలడగండి. ఒక్కముక్క కూడా చెప్పలేరు ఎందుకని? మనం వీరికి సెక్స్ ఎడ్యుకేషన్ ఇవ్వటం లేదు కాబట్టి- ఇది నిజంగా మనందరం సిగ్గుపడాల్సిన విషయం. ఈ 20వ శతాబ్దంలో కూడా- మన పిల్లలకు అన్నీ తెలుసుగానీ తామెలా పుట్టిందీ వారికి తెలీకపోవడం దారుణం!"

అందరికీ ఆమాట నిజమేననిపించి సిగ్గుతో తలలు వంచుకున్నాం.

"ఆయన్జెప్పింది నిజమేరా భాయ్! మన పోరగాళ్ళ గురించి మనం సోంచా యించనేలేదు-" అన్నాడు యాదగిరి.

"అవును! పాపం వాళ్ళు పెద్దాళ్ళయ్యాక మనలాగానే సెక్స్ గురించి ఏమీ తెలీని అమాయకులయిపోతారు" అన్నాడు గోపాల్రావ్.

"నిజంగా వాళ్ళను చూస్తే జాలేస్తోంది" అన్నాడు చంద్రకాంత్.

కమిటీ అధ్యక్షుడు పిల్లల వేపు తిరిగాడు.

"చూడండి పిల్లలూ! మనకు స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో చెప్తారా?"

పిల్లలంతా మొఖాలు చూసుకున్నారు.

"ఫిబ్రవరి పదిహేనో తారీఖు-" అన్నాడొకడు కొద్దిక్షణాలయాక.

ఓ ఆడపిల్ల కిసుక్కున నవ్వింది.

"ఛీ తప్పు! జనవరి ఇరవై ఆరు'" అంటూ సరిచేసింది వాడిని.

"ఛీ కాదు! ఆగస్ట్ ఇరవై ఆరు" అంది మరోపిల్ల. ఆ తరువాత అందరూ ఎవరికిష్టమొచ్చిన తారీఖు వాళ్ళు చెప్పటం ప్రాంభించారు.

"మార్చి పదకొండు 1978, అక్టోబర్ రెఒండో తారీఖు, జనవరి ముప్పైరెండు" ఇలా సాగిపోయింది.

మా అందరికీ వాళ్ళమీద కోపం ముంచుకొచ్చింది. ఇంచుమించుగా ప్రతి క్లాసు పుస్తకంలోనూ, ఆ తారీఖు స్పష్టంగా ఉంటుంది. అయినా పదోక్లాసు పిల్లలవరకూ ఎవరికీ తెలీలేదంటే-

యాదగిరి కోపంగా వాళ్ళ కుర్రాడిని చాలగొడతానని బయలుదేరాడు గానీ మేమంతా వెనక్కు లాగేశాం.

"లేకుంటేఏమి? ఆడుదినాము సదువుతాడు ఆ పాఠం! అయినగాని చెప్పనికి రాకున్నది" అన్నాడు మండిపడుతూ.

కమిటీ అధ్యక్షుడు మొఖానికి పట్టిన చెమటలు కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

"మన ప్రధానమంత్రి ఎవరు?" అంటూ అతనడిగాడో లేదో అంతా ముక్తకంఠంతో "ఎన్టీఆర్, ఎన్టీఆర్" అంటూ గావుకేకలేశారు.

అధ్యక్షుడు మళ్ళీ కర్చీఫ్‌తో మొఖం తుడుచుకున్నాడు.

"నేనడిగేది మన ప్రధానమంత్రి గురించి! ప్రైమ్‌మినిష్టర్–" అన్నాడు వత్తి పలుకుతూ.

"అవును! ఎన్టీఆర్" అన్నారు అందరూ మళ్ళీ.

టెన్త్‌క్లాస్ చదువుతున్న వాళ్ళిద్దరు మాత్రం వేరే సమాధానం చెప్పారు "అమితాబ్‌బచన్"

"మహాత్మాగాంధీ తల్లి పేరేమిటి?"

"ఇందిరాగాంధీ!" అన్నారు చాలామంది.

"కాదు. మేనకాగాంధీ!" అన్నారు కొందరు.

"ఛీ! అవేమీకాదు! రోహిణిహట్టన్‌గడీ"

"సోనియాగాంధీ!"

"దుర్గాభాయ్ దేశ్‌ముఖ్"

ఆ లిస్ట్ భరించలేక "ఇంకచాలు" అని అరచాడతను.

"మహాత్మాగాంధీ పూర్తిపేరు ఏమిటో చెప్పండి పోనీ!"

"బెన్‌కింగ్స్‌లే–"

"ఆటెన్‌బరో"

"గాంధీతాత–"

"మగధ సామ్రాజ్యాన్ని పాలించిన వారిలో గొప్ప చక్రవర్తి ఎవరు?"

"శాతవాహనుడు"

"ఔరంగజేబు"

"బాబర్"

"చంద్రగుప్త విక్రమాదిత్య"

"మన జాతీయగీతం ఏదో చెప్పగలరా?"

"జనగణమన" అరచారందరూ.

అధ్యక్షుని మొఖం చాటంతయింది.

"అది ఎవరు రచించారు?"

"సి. నారాయణరెడ్డి!" "వేటూరి" "జంధ్యాల"

అధ్యక్షుడు ఇంక భరించలేకపోయాడు.

"మరేం లేదు! కొంచెం కన్‌ఫ్యూజన్ వల్ల చెప్పలేక పోతున్నారంతే! కనుక నేను చెప్పొచ్చేదేమిటంటే ఇంతకాలం నుంచి పాఠ్యాంశాలుగా ఉన్న వాటి గురించే వారు సమాధానం చెప్పలేకపోతే ఇక వాళ్ళు ఏనాడూ చదవని సెక్స్ ఎడ్యుకేషన్ గురించి ఏం తెలుసుకోగలరు? కావాలంటే చూడండి! ఒక సింపుల్ కొశ్చెన్ అడుగుతాను! అది కూడా వాళ్ళు చెప్పలేరని ఘంటాపథంగా చెప్పగలను"

అందరం ఆసక్తిగా గమనించసాగాము.

"కొంతమందికి పిల్లలు పుట్టరు. ఎందుకని?"

అతనా ప్రశ్న అడిగాడో లేదో పిల్లలంతా గట్టిగా అరచేశారు.

"కుటుంబ నియంత్రణ"

"ఫామిలీ ప్లానింగ్"

అతను నివ్వెరపోయాడు.

"ఆల్‌రైట్! ఆ ప్రశ్న వదిలేయండి! కుటుంబ నియంత్రణ అంటే ఏమిటి?"

"బిడ్డకూ బిడ్డకూ మధ్య ఎడం–" అరిచాడో కుర్రాడు.

"నిరోధ్–" యాదగిరి కొడుకు మైక్ దగ్గరకొచ్చి అరచాడు.

"లూప్–" అందో పాప.

"ఓరల్ టాబ్‌లెట్స్–"

లోయర్ కే.జి. చదువుతున్న ఓ చిన్నపాప అంతా మాట్లాడాక నెమ్మదిగా వివరించింది.

"ఓరల్ టాబ్‌లెట్సయితే– ప్రతిరోజు రాత్రి ఒకటి వేసుకోవాలి! ఒకవేళ ఒకరోజు ఒకటి మర్చిపోతే రెండోరోజు రెండు వేసుకోవాలి–"

"అవును! నర్స్ చెప్పింది!"

కమిటీ అధ్యక్షుడు మొఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు.

"అవునూ– వీళ్ళకెలా తెలుసివన్నీ?" అడిగాడు అధ్యక్షుడు. శాయిరామ్ అతనిని పిచ్చివాడిని చూసినట్లు చూశాడు.

"ఎలా తెలియటమేమిటి? ప్రతి ఇంట్లోనూ రేడియో గానీ, టీవీగానీ ఉండక తప్పదు గదా! అని ఉన్నప్పుడు ఆ విషయాలు తెలీకుండా ఎలా ఉంటాయ్?"

"అంటే టీవీ రేడియో ద్వారా సెక్స్ ఎడ్యుకేషన్ ఇస్తున్నారా?" అడిగాడతను అయోమయంగా.

"ప్రభుత్వం ఆ ప్రోగ్రామ్స్‌కి పేరు ఏం పెట్టిందో తెలీదు గానీ అలాంటి అద్దమయిన చెత్తా లోయర్ కే.జి. పిల్లలందరికీ కూడా తెలుసు."

"ఇవేనా? ఇంకేమయినా తెలుసా వీళ్ళకు?" కుర్చీలో కూలబడుతూ అన్నాడతను.

యాదగిరి హడావుడిగా స్టేజ్‌మీదకు నడిచాడు.

"మావాడు వేసక్టమీ గురించి భలే చక్కగా మిమిక్రీ చేస్తాడు! చూడండి!" అంటూ వాళ్ళ కుర్రాడిని ముందుకు తీసుకొచ్చాడు.

"చెప్పరా! వేసక్టమీ గురించి చెప్పు"

"ఏమి రంగయ్య మామా! ఏమిటిలా దిగులుగా వున్నావు? వేసక్టమీ చేయించుకోలేదా?"

"లేదు వెంకయ్య మామా!"

"అరె! తొంభై ఏళ్ళొచ్చినయ్ ఇంకా చేయించుకోలేదా? ఎందుకని?"

"వేసక్టమీ చేయించుకుంటే మగసిరి పోతుందటగా?"

"నీకు ఆ విషయం చెప్పిన వ్యక్తి వేసక్టమీ చేయించుకున్నాడా?"

"లేదు-"

"ఎందుకని?"

"వాళ్ళావిడ ఈలోగానే విడాకులు తీసుకుందిట-"

"చూశావా మరి! అందుకే పుకార్లు నమ్మకూడదు! వేసక్టమీ చేయించుకున్నవ్యక్తి తెగ ఆరోగ్యంగా ఉంటాడు. సంసార సుఖాలకు ఏ లోపమూ ఉండదు!"

"అయితే ఇవాళే సమీపంలోని కుటుంబ నియంత్రణ కేంద్రానికి వెళ్తాను." టింగ్ - టింగ్-"

గోపాల్రావ్ వాళ్ళ పాపను మైక్ దగ్గరకు తీసుకొచ్చాడు.

"చెప్పమ్మా! గర్భం ఎలా వస్తుంది?"

"గర్భము అనేక విధములుగా కలుగును. మొదటి విధము:-

"స్త్రీకి ఎక్కువగా, చలి వేసినప్పుడు వెచ్చదనము ఇచ్చుట వల్ల వచ్చును."

అందరూ అదిరిపడ్డారు.

"అదేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు అధ్యక్షుడు.

"అవునంకుల్! అదేదో సినిమాలో హీరోయిన్ ఐస్ తుఫాన్‌లో ఇరుక్కుపోతే హీరో ఆమె పక్కనే పడుకుని వెచ్చదనం ఇస్తాడంకుల్! అందుకని ఆమెకు గర్భం వస్తుంది.

రెండవ విధము- రేప్ చేయబడుట వలన కూడ గర్భము రావచ్చును. అయితే రావాలని గ్యారంటీ ఏమీలేదు. కొన్ని సినిమాల్లో వచ్చును. కొన్ని సినిమాల్లో రాదు."

"నీకెలా తెలుసదీ?"

"టీవీలో చూపించే సినిమాలన్నింటిలో రేప్ సీన్లుంటాయ్ అంకుల్."

"అంతేకాదు! టెన్త్ చదువుకునే ఆడపిల్లా, మగపిల్లాడు ప్రేమించుకున్నా కూడా గర్భం వస్తుంది- మొన్నేగా ఆ సినిమా కూడా టీవీలో చూబించారు"

"అవునవును– భలే బాగుంటుందా సినిమా! ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆ అబ్బాయి ఆ అమ్మాయి ఇంటికొచ్చి సెక్స్ చేసేస్తాడు కదూ?"

"అబ్బ! ఎంత రంజుగా ఉంటుందో ఆ సీను–"

"ఆపండి! ఇంక చాలు!" చెవులు మూసుకుంటూ గావుకేక పెట్టాడు కమిటీ అధ్యక్షుడు. కానీ అతని మాట ఎవరూ వినిపించుకోవటం లేదు. అప్పటికే కాలనీ వాళ్ళందరూ సెక్స్ ట్రాన్స్‌లో కెళ్ళిపోయారు.

తమ తమ పిల్లలకు సెక్స్ పరిజ్ఞానం ఎంత ఎక్కువగా ఉందో ఆ కమిటీ వాళ్ళందరకూ చూపించి వాళ్ళ మెప్పు పొందాలనీ, తద్వారా దేశమంతా గుర్తింపు సంపాదించాలనీ, లేదా "అతి పిన్నవయసులో అతిపెద్ద పరిమాణంలో సెక్స్‌విజ్ఞానం సంపాదించిన పాప" అనే గిన్నిస్ రికార్డ్ నెలకొల్పాలనీ ఉవ్విళ్ళూరిపోసాగారందరూ.

దాంతో స్టేజి మీద రకరకాల విన్యాసాలు ప్రారంభమయాయ్.

పార్వతమ్మ గారు వాళ్ళ చిన్నపిల్లను బరబరా స్టేజ్ మీదకు ఈడ్చుకొచ్చింది.

"మా పాప అని గొప్పలు చెప్పుకోవటం కాదు గానీ అన్నయ్య గారూ! జ్యోతిలక్ష్మిలు, సిల్కుస్మితలూ కూడా పినికరారు! అంత చక్కగా డాన్సులు చేయగలదు మా పాప! చూస్తావేమే! అంకుల్స్ చూస్తారుట! బాగా సెక్స్ డాన్స్ చెయ్–" అంటూ పురమాయించింది.

వాళ్ళమ్మ చెప్పటం ఆలస్యం ఆ పిల్ల రెచ్చిపోతూ, ఛాతీని విసురుతూ, నడుము భాగంలో సైక్లోన్ వచ్చినట్లు ఊపేస్తూ, చాలా అసహ్యకరమయిన సైగలు చేస్తూ పాట ప్రారంభించింది.

"అసలే ఇది మొదటి రాత్రి! నాకసలే ఇది మొదటిదే బుల్లి!

"ఏం చేస్తావ్‌రో మామో!"

"అసలే నషాగా ఉన్నదే పిల్లో– కసికసిగా నలిపేస్తానో బుల్లో–

నడుము నలుపుతా– ఆహా–

బొడ్డు కెలుకుతా– ఓహో–

పెదిమ కొరుకుతా– ఈహే–

చీర ఒలుస్తా– ఏహే–

అంతా తప్పట్లు ఈలలు మార్మోగిపోతున్నయ్. చాలామంది కాలనీ స్టూడెంట్స్ వన్స్‌మోర్ అంటూ అరుస్తున్నారు.

కమిటీ మెంబర్లు ఆ దృశ్యాలు చూళ్ళేక గావుకేకలు పెట్టి ఆ డాన్స్ ఆపించారు. ఈలోగా ఇంకొకావిడ వాళ్ళ పాపను స్టేజిమీదకు తీసుకొచ్చింది.

"మరండీ! నేనసలు మన తెలుగు సినిమాలు చూసే మా పక్కింటి టైలర్‌తో లేచిపోయనన్నమాటండీ! కానీ వాడు మేం లేచిపోకముందు చూపించిన రొమాంటిక్

చేష్టలు– తీరా మేము లేచిపోయాక చూపించటం మానేసి చప్పబడిపోయాడండీ! నా బాడీ లాంగ్వేజేమో తెలుగు సినిమా బాడీ లాంగ్వేజన్నమాటండీ! ఎలా సరిపుచ్చుకోగలనండీ! అందుకే మా ఆయన వాళ్ళ ఫ్రెండ్‌ని పెళ్ళి చేసుకున్నానన్నమాటండీ!

ఇప్పుడు వయస్సు ఎనిమిదేళ్ళేగానండీ– మా పాపక్కూడా నాలాగానే సినిమాలంటే ప్రాణమన్నమాటండీ! సెక్స్ సినిమాలన్నీ ఒకోటీ అయిదుసార్లు చూస్తుందండీ!"

"ఏయ్ హలం! మొన్న రిలీజయిన సెక్స్ సినిమా కథ చెప్పమ్మా–" అంది ఆ పిలతో.

ఆ పిల్ల చాలా ఉత్సాహంగా కథ చెప్పటం ప్రారంభించింది.

"హీరో హీరోయిన్ ప్రేమించుకుంటారు. కానీ విలన్ కూడా హీరోయిన్‌ని ప్రేమిస్తాడు. ఛాన్స్ దొరికితే గడ్డివాములో రేప్ చేయాలని చూస్తుంటాడు. అందుకని హీరోయిన్ ఆ విలన్‌ని గడ్డివాము దగ్గర బాగా కవ్విస్తుంటుందన్నమాట! ఎప్పుడా విలన్‌గాడు హీరోయిన్ శీలం హరించేస్తాడోనని హీరోయిన్ తండ్రి హీరోతో పెళ్ళి నిర్ణయించేస్తాడు. పెళ్ళి ముహూర్తానికి రెండుగంటల టైముందనగా విలన్ హీరోయిన్‌ని కిడ్నాప్ చేసి రేప్ చేసేస్తాడు–"

"అయ్యో! రేప్ చేసేశాడా?" అడిగారెవరో.

"అదే సినిమాలో వెరయిటీ!"

"మరి గర్భం వచ్చిందా?"

"అప్పుడే కాదు. ఇంటర్వల్ తరువాత వస్తుంది– కానీ రాథ హీరోని పెళ్ళి చేసుకోదు. ఇంకొకతన్ని పెళ్ళి చేసుకొంటుంది. –"

మరి గర్భంతో ఉన్న సంగతి అతనికి చెప్తుందా?"

"చెప్పదు"

"పాపం చెప్పకుండా వుంటే మోసం చేసినట్లువుతుంది కదా–"

"కానీ చెప్తే అతను పెళ్ళి చేసుకోడు కదా!"

"తరువాతేమవుతుంది?"

"పాపాయి పుడతాడు! ఆ పాపాయికి హీరో పోలికలుంటాయి కదా!"

"అవునవును–"

"అందుకని భర్తకు అనుమానం వస్తుంది–"

"అబ్బ! భలేగా ఉందిలే కథ! తరువాతేమవుతుంది?"

"అతను రాధను వదిలేస్తాడు!"

"ఊరికే వదిలేస్తాడా– విడాకులిస్తాడా?"

"ఊరికే వదిలేస్తాడు– అప్పుడు హీరో వచ్చి ఆమెను పెళ్ళి చేసుకుంటాడు"

"మంచి సీన్లేమయినా ఉన్నాయా?"

"మొదటిరాత్రి సీన్లు మూడున్నాయ్ సినిమాలో! ఒకోటి పది నిముషాలు చూపించాడు."

"అబ్బ! ఎంత బాగుంటుందో కదూ"

"చాలా బాగుంటుంది! చాలా సెక్సీ పాటలు కూడా ఉన్నాయ్."

మేమంతా కూడా ఆ కథలో లీనమయిపోయాం.

"తరువాతేం జరుగుతుంది?" అడిగాడు గోపాల్రావ్ ఆత్రుతగా.

"ఆపండి" గట్టిగా అరచాడు కమిటీ అధ్యక్షుడు.

అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"ఎవరు అరచింది?" గోపాల్రావ్ ఆశ్చర్యంగా అడిగాడు నన్ను.

"కమిటీ ప్రెసిడెంట్ అనుకుంటాను" అన్నాడు శాయీరామ్!

"ఆ పాప– అంత చక్కగా సినిమా కథ చెప్తోంటే మధ్యలో అలా గావుకేక వేస్తాడేమిటి?" అన్నాడు జనార్ధన్ కోపంగా.

"ఇప్పుడు సినిమాల్లో లాగా "ఆపండి" అంటూ గావుకేక పెట్టింది మీరేనా?" స్టేజి దగ్గరకెళ్ళి అడిగాడు రంగారెడ్డి.

"అవును! నేనే ఆ చిన్న పిల్లను అలా ఆ వెధవ సినిమాల్లోని రేప్ సీన్ల గురించీ, శోభనం రాత్రుల గురించీ అడిగి తెలుసుకోడానికి మీకు సిగ్గు వేయటం లేదూ?" కోపంగా అడిగాడతను.

మేమందరం మొఖాలు చూచుకున్నాం. ఇంత చిన్న విషయానికి అతనెందుకలా ఎగ్జయిట్ అయిపోతున్నాడో అర్థం కావటం లేదు.

"సమ్ థింగ్ రాంగ్ విత్ హిమ్–" అన్నాడు రంగారెడ్డి ఓ క్షణం ఆలోచించి.

"ఇందులో సిగ్గుపడాల్సిందేమిటో మాకేం తెలీటం లేదు–" అన్నాడు శాయీరామ్ అతనితో.

అతని మొఖం మరింత కోపంగా మారింది.

"ఎందుకు సిగ్గుపడాలో తెలీటంలేదా! హౌ షేమ్‌లెస్! ఇంత చిన్న చిన్న పిల్లలు అసభ్యకరమయిన సైగలు చేస్తూ ఆ బూతు సినిమా పాటలు పాడుతూంటే మీరంతా అది చాలా మామూలు విషయమయినట్లు ఆనందిస్తున్నారా?" ఈసారి అక్కడ చేరిన ఆడా మగా ముసిముసిగా నవ్వుకున్నారు అతనిని చూసి. "వీడెక్కడో అండమాన్ నుంచి వచ్చినట్లున్నాడు" అంటున్నారెవరో.

"సినిమా పాటలన్నాక మరి బూతు ఉండక ఇంకేముంటుంది– ఇదేదో కొత్త విషయం మాట్లాడుతున్నారు మీరు!" అన్నాడు శాయిరామ్ వాదనలోకి దిగిపోతూ.,

"అవును! పైగా ప్రతి సంవత్సరం ఓ బూతు సినిమా పాటకూ, ఓ బూతు సినిమాకీ

ప్రభుత్వమే బహుమతు లిస్తోంటే మధ్యలో మీ గొడవేంటి?" తనూ రంగంలోకి దిగాడు జనార్ధన్.

"మీకు తెలీదేమో! చిన్న పిల్లల మధ్య ప్రేమ– సెక్స్‌ని ప్రోత్సహించే చాలా చిత్రాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే బహుమతులిచ్చింది–" అన్నాడు శాయిరామ్ వ్యంగ్యంగా. "గవర్నమెంటే కాక బూతు సినిమాలకు అవార్డ్ లిచ్చే సినిమా సంఘాలు బోలెడున్నాయ్" అన్నారెవరో.

"అయినా అవన్నీ మీకేమీ తెలీనట్లు నటిస్తారేమిటి? మీరు ఆంధ్రప్రదేశ్‌లో కాదా ఉండేది?" అడిగాడు రంగారెడ్డి.

"నేను గత పదేళ్ళుగా హిమాలయాల ప్రాంతంలో ఉంటున్నాను"– అన్నాడతను మొఖానికి మళ్ళీ పట్టిన చెమటలు తుడుచుకుంటూ.

"అదీ సంగతి! అందుకే మరీ విపరీతంగా మాట్లాడుతున్నారు–"

"మన తెలుగువాళ్ళ టీవీ రేడియో ప్రోగ్రాములు చూసి ఉంటే పాపం– మరీ ఇంక షాక్ తినేవారు కాదు–" అంది పార్వతమ్మ జాలిగా.

అతను అదిరిపడ్డాడు.

"అంటే మీ టీవీలోనూ, రేడియోలోనూ, ఇప్పుడా పిల్లలు మాట్లాడిన అడ్డమయిన చెత్తా వస్తుందా?" తెల్లబోతూ అడిగాడు.

"దాన్ని చెత్త అన్నారంటే బావుండదు!" అన్నాడు జనార్ధన్ జేబులోనుంచి దువ్వెన తీసి క్రాఫ్ సరిచేసుకుంటూ.

"ఏం ఎందుకని"

"అందులో మా కాలనీ వాళ్ళందరం కలసి ఫామిలీ వెల్ఫేర్ ప్రోగ్రాం కింద గర్భ నిరోధక చర్యలు సబ్జెక్ట్ తీసుకుని ఓ స్క్రిప్ట్ వేశాము. నేను హీరోగా వేశానందులో–"

"అవును ! టీవీ ప్రేక్షకుల నుంచీ ఆ సినిమా స్క్రిప్ట్ అద్భుతంగా ఉందని తెగ ఉత్తరాలు కూడా వచ్చాయ్. నేనే రాశానా స్క్రిప్టు" అన్నాడు చంద్రకాంత్ చటోపాధ్యాయ.

"అంకుల్– ఆ రోజే పశువులకు సంబంధించిన సెక్స్ కూడా చూపించారు. టీవీలో! కదూ?" ఉత్సాహంగా మధ్యలోకొచ్చి అరచాడో కుర్రాడు.

"శివ శివా" అన్నాడు కమిటీ అధ్యక్షుడు అక్కడే కూలబడిపోతూ.

ఇంకో ఉత్తరదేశం మెంబరు నెమ్మదిగా లేచి మా దగ్గరకొచ్చాడు.

"మీ టీవీకి, రేడియోకి – సెన్సారింగ్ లాంటివేమీ లేవా?" అనడిగాడు హిందీలో. ఆ ప్రశ్న వింటూనే అందరూ పెద్ద జోక్ విన్నట్లు నవ్వారు.

"సెన్సారింగ్ లేదని ఎవరన్నారు? సాగరసంగమం చిత్రంలోని ఓ పాటలో బూతు ఎక్కువగా ఉందని ఆ పాట సెన్సార్ చేసి టీవీలో మిగతా సినిమా చూపించారు కదా–"

కమిటీ అధ్యక్షుడు ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు.

"ఏమిటి? సాగర సంగమం లాంటి ఫామిలీ పిక్చర్‌లో - కె.విశ్వనాథ్ లాంటి గొప్ప డైరెక్టర్ సినిమాలో బూతుపాట ఉందా? మీకేం మతిపోలేదు- కదా?"

"ఇదిగో గురూజీ! జరిగిందది! అందుకే ఆ పాట కట్ చేశామని టీవీవాళ్ళు జాబులు- జవాబుల్లో చెప్పారు. మధ్యలో మీకు సిగ్గులేదా, మతిలేదా అని మమ్మల్ని దక్కండి!" కోపంగా అన్నాడు జనార్ధన్.

"అయినా ఆ సెన్సారింగ్ వాళ్ళదేం తప్పుందనీ! పాపం వాళ్ళకిష్టమయిన 'ఏ' సర్టిఫికెట్ సినిమాల్లో పాట చూపిస్తూనే ఉంటారు అందరి కోసమని! చాలా లిబరల్ పాపం-"

ఈలోగా యాదగిరి వాళ్ళబ్బాయిని ఈడ్చుకొచ్చాడు స్టేజీమీదకు.

"చెప్పరా! నువ్వు వారపత్రికలు గిట్ట సదువుతావు గదా! అందులోకెళ్ళి మంచి సీరియల్స్ గురించి చెప్పు!"

వాడు ఓ క్షణంఆలోచించాడు.

"ఏది చెప్పను?"

"కథలో ఆ చిన్న పాపకు గర్భం వస్తుందే- ఎందుకొచ్చిందో ఎలా వచ్చిందో రాశారు కదా- అదంతా చెప్పు."

కమిటీ అధ్యక్షుడు అదిరిపడ్డాడు.

"చిన్న పాపకు గర్భం రావటమా?"

"అవున్సార్! చాలా మంచిగుంటందా కథ, మాపోరడే సదివి చెప్పిండు నాకు"

"పోనీ ఇంకో కథ చెప్తాను డాడీ! దానిపేరు - టెస్ట్‌ట్యూబ్ బేబీ- స్పెర్మ్‌బాంక్-"

"స్టాపిట్!" గట్టిగా అరచాడు అధ్యక్షుడు.

"ఊరికే అలా గావుకేక లేయొద్దని చెప్పానా?" విసుక్కున్నాడు జనార్ధన్.

"లేపోతే ఏమిటయ్యా ఇది- చిన్న పిల్లలతో అలాంటి పుస్తకాలు చదివిస్తున్నారా మీరు?"

"చిన్న పిల్లలా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి. "ఎవరి గురించి మీరు మాట్లాడేది?"

"ఎవరిగురించేమిటి? వీళ్ళందరూ చిన్న పిల్లలు కాదూ?"

అందరూ ఘొల్లున్న నవ్వారు మళ్ళీ.

"మీకేమయినా మతిపోయిందేమిటి గురూజీ! వీళ్ళంతా యువకులు, యువతులు గానే లెక్క! చిన్న పిల్లలు అంటూ ప్రస్తుతం మా కాలనీలో గానీ మనదేశంలో గానీ ఎవరూ లేరు. అయిదేళ్ళకే మనదేశంలో అందరూ 'ఎడల్ట్స్' అయిపోతారు- అయిదేళ్ళలోపే చిన్నపిల్లలు-"

ఈలోగా రాజేశ్వరి వాళ్ళబ్బాయిని బలవంతంగా ఎత్తుకొచ్చింది.

"మొన్న వారపత్రికలో నువ్వు చదివావ్ చూడు – ఆ డాక్టర్ ప్రశ్నలు–జవాబులు శీర్షిక. ఆ రెండు ప్రశ్నలూ ఆ అంకుల్‌కి చెప్పమ్మా" అంది అప్యాయంగా.

"నేన్చెప్పను–" అన్నాడు వాడు మొండికేసి.

"మా బంగారుకొండ కదూ! అంకుల్ నీకు చాక్‌లెట్లిస్తారు! చెప్పమ్మా!"

"ఆడు దొంగబాడుకవ్! చాక్‌లెట్టియ్యడు!"

"మా తండ్రికదూ! చెప్తే అంకుల్ నీకు 'ఎ' సర్టిఫికెట్ సినిమా చూపిస్తారుట" వాడి మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"అక్కయ్యా! ఓవమ్ అంటే ఏమిటి? అది ఎన్ని రోజులకు పెరుగుతుంది?"

"చెల్లీ! ఓవమ్ స్త్రీ నుంచి ఉత్పత్తి అవుతందమ్మా! రౌండ్‌గా రెండు మిల్లీమీటర్ల సైజు ఉంటుంది! క్లీ వేజ్ న్యూక్లియస్ తరువాత అది క్రమేపీ పెరిగి 265 రోజులోలష్ట్ర& పిల్లలు పుడతారు–"

కమిటీ అధ్యక్షుడు ఛటుక్కున ముందుకు వంగి వాడి నోరు నొక్కేశాడు.

"ఇవన్నీ మన వారపత్రికల్లో రాస్తున్నారా?"

"అవునూ– తప్పేముంది? గర్భస్రావం గురించీ, సెక్స్ సమస్య గురించి, పిరీడ్స్‌గురించీ – ఏం కావాలన్నా మన వారపత్రికల్లో దొరుకుతాయ్" చెప్పాడు రంగారెడ్డి.

"అంటే అవి పెద్దల పత్రికలు కదా– పిల్లల కెందుకిస్తున్నారు?"

"సకుటుంబ పత్రికలని రాస్తున్నారు కద్సార్– అయినా పత్రికల్లో ఎడల్ట్స్ ఓన్లీ అనే క్లాసిఫికేషన్ లేనిదే ఎలా తెలుసుకోవటం?" ఎదురు ప్రశ్న వేసాడు జనార్ధన్.

"అదే మన ప్రభుత్వానికీ, మనాళ్ళకీ తేడా గురూజీ! ప్రభుత్వమేమో ఎనిమిదో క్లాస్ నుంచీ సెక్స్ ఎడ్యుకేషన్ ఉండాలా వద్దా ఉంటే ఎంతవరకూ ఉండాలీ అని నానా హైరానా పడుతోంది కానీ మన టీవీ ఛానల్సూ, రేడియో, పత్రికలూ, సినిమాలూ ఎప్పుడో ఎడ్వాన్స్ అయిపోయాయి. లోయరు కే.జి. నుంచే ఆ విజ్ఞానం అంతా అందజేస్తున్నాయి."

అప్పుడే ఒకావాడ వాళ్ళబ్బాయని నెమ్మదిగా నడిపించుకొచ్చింది.

"ఏమండోయ్– ఇందాక మీరన్నారు చూడండి– పిల్లలకు పాపం పిలల్లలెలా పుడతారో తెలీదని! మీ మాట తప్పు, మా వాడికి అన్నీ తెలుసు"

అధ్యక్షుడు నీరసంగా ఆమె వేపు చూశాడు.

"తెలుసా?"

"అవునండీ!"

"ఎలా తెలుసు?"

"వాళ్ళ ఎలిమెంటరీ స్కూల్ పక్కనే రెండు సినిమా హాల్స్ ఉన్నాయి. వాటిల్లో ఎప్పుడూ సెక్స్ ఎడ్యుకేషన్ పేరుతో చాలా చెత్త సినిమాలు ఆడుతూంటాయి. వీళ్ళ

స్కూల్ గోడలమీదా, సినిమాహాల్ గోడల మీద పెద్ద పెద్ద వాల్ పోస్టర్స్‌లో- స్త్రీ అవయవాలు, పిల్లలు పుట్టే దృశ్యాలు- అన్నీ చాలా వివరంగా కనిపిస్తాయి. వాటిని వీళ్ళు రోజూ చూస్తుంటారు- అదిగో ఆమూల చాక్‌పీస్ పట్టుకుని నిలబడ్డాడు చూడండి. కమలమ్మ గారి అబ్బాయి! మీరు చూస్తానంటే ఆ బొమ్మలన్నీ ఇక్కడ బోర్డు మీద వేసి చూపిస్తానంటున్నాడు. చాలా బాగా ప్రాక్టీస్ చేశాడు ఆ డ్రాయింగ్స్ అన్నీ-"

కమిటీ అధ్యక్షుడు జట్టు పీకేసుకుంటూ "నో! గెటెవే" అంటూ మళ్ళీ గావుకేక పెట్టాడు.

"మళ్ళా ఏమిటి?" చిరాకుగా అడిగాడు జనార్ధన్.

"సోదర సోదరీమణులారా! ప్రస్తుతం లోయర్ కే.జీ. పిల్లల మీద మల్టీమీడియా ద్వారా బలవంతంగా రుద్దబడుతున్న సెక్స్ ఎడ్యుకేషన్‌ని ప్రభుత్వం నిషేధించాలి" ఆవేశంగా అరచాడతను మైక్‌లో.

మాకెవరికీ నోట మాట రాలేదు.

"అదేమిటి సెక్స్ ఎడ్యుకేషన్‌ని ప్రేశపెట్టాలని ఇందాక మీరేగా అన్నారు?" అడిగాడు రంగారెడ్డి.

"అవును! అన్నాను-"

"ప్రభుత్వం దానికోసమే మీ కమిటీని కూడా వేసిందని చెప్పారు!"

"అవును! వేసింది'-"

"మరిప్పుడు సెక్స్ ఎడ్యుకేషన్ నిషేదించాలంటారేమిటి?"

''అవును! ముమ్మాటికీ నిషేధించాలి! నిషేధించాలి'' అంటూ స్టేజి దూకి పరిగెత్తాడతను- జుట్టు పీక్కుంటూ- వెనుకే మిగతా మెంబర్లు కూడా పరుగెత్తారు. సంగతేమిటో అర్థంకాక మేము వారిని వెంబడించి వాళ్ళెక్కిన కారు చూట్టూ మూగాము.

"సంగతేమి - గిట్ల ఉరుకుతున్రు?" అడిగాడు యాదగిరి అధ్యక్షుడి దగ్గరకెళ్ళి.

"ఇక్కడ - ఈ పిల్లల మధ్య ఇంకాసేపుంటే మా అందరికీ పిచ్చెక్కిపోతుంది" భయంగా అన్నాడతను.

"పిచ్చెక్కుతుందా?"

"పూర్తిగా! అన్ క్యూరబుల్ మాడ్‌నెస్-"

"కాని మరి మేమంతా ఏ పిచ్చీ ఎక్కకుండా- వాళ్ళతోపాటే ఉంటున్నాము కదా-" అడిగాడు రంగారెడ్డి.

"అవును! ఇంతవరకూ ఒక్కరికి కూడా పిచ్చి ఎక్కలేదు! మా కాలనీలో నుంచి ఎవ్వరినీ పిచ్చాసుపత్రిలో చేర్చనేలేదు-" అన్నాడు శాయిరామ్.

సరిగ్గా అప్పుడే యాదగిరి వాళ్ళబ్బాయి ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు. గడ్డియన్నారం

నుంచి బేబీ జానకి, మాస్టర్ చింటూ, వాళ్ళ తమ్ముడూ, చెల్లాయ్ ఇంకా వారి మిత్రులూ వీరందరి కోరిక పైనా.

రాత్రి రహస్యం చిత్రంలోని పాట-

"శోభనం- ఇది శోభనం-

ఏయ్- నిన్నే-

ఏమిటండీ?

తెల్లకోక కట్టావా?

ఊ!

మల్లెపూలు పెట్టావా?

ఊ!

ఇకరావే సయ్యాటకూ- వళ్ళంతా కైపెక్కిపోతున్నాదే-

నిద్ర వస్తోందండీ-

తొలి రాత్రి కాళరాత్రి కావాలే పిల్లా-

నిద్దరనేది అసలే లారాదే మళ్ళా- ఊ! ఉ హు హ- ఊ - ఉహుహ-

(మూలుగుడు వినిపించసాగింది)

కమిటీ అధ్యక్షుడు ఈసారి చెమటలు తుడుచుకోలేదు.

"చూడండి! మీ కాలనీ నుంచి ఇంతవరకూ ఎవరూ పిచ్చాసుపత్రికి పోలేదన్నారు కదూ?"

"అవును!" సగర్వంగా చెప్పాడు రంగారెడ్డి.

"అందుక్కారణం ఏమిటో తెలుసా?"

"ఏమిటి?"

"అసలు మీరున్నదే పిచ్చాసుపత్రిలో!"

అందరం ఉలిక్కిపడ్డాం.

"మేము పిచ్చాసుపత్రిలో ఉన్నామా?"

"అవును! ఆ పిచ్చాసుపత్రి పేరేమిటో తెలుసా?"

ఎవ్వరం మాట్లాడలేదు.

"ఏమిటి?" కొద్ది క్షణాల తర్వాత అడిగాడు శాయిరామ్.

"ఆంధ్రప్రదేశ్" లేదా "భారతదేశం"

కాదు స్టార్టయి వెళ్ళిపోయింది.

అందరం వాళ్ళ మాటలు అర్థంకాక మొఖాలు చూసుకున్నాము మళ్ళీ. ఈలోగా స్టేజీమీద పిల్లలు కొంతమంది రికార్డ్ డాన్స్ చేస్తూండడంతో ఆ విషయం ఆలోచించటం మానేసి స్టేజ్ దగ్గరకు పరుగెత్తాం- వాళ్ళ డాన్స్ ఎంజాయ్ చేయటానికి!